మాట్లాడుతున్న గొంగిడి సునీత, చిత్రంలో పైళ్ల శేఖర్‌రెడ్డి

ఐఐహెచ్‌టీని తరలిస్తే ఊరుకోం

- భూదాన్ పోచంపల్లిలోనే ఏర్పాటు చేయాలి
- బీఆర్ఎస్ హయాంలోనే కేంద్రానికి ప్రతిపాదనలు
- మాజీ ఎమ్మెల్యేలు గొంగిడి సునీత, పైళ్ల శేఖర్‌రెడ్డి ఫైర్

యాదాద్రి భువనగిరి, సెప్టెంబర్ 10 (నమస్తే తెలంగాణ): యాదాద్రి భువనగిరి జిల్లా నుంచి ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్లూమ్ టెక్నాలజీ (ఐఐహెచ్‌టీ)ని తరలిస్తే ఊరుకునే ప్రసక్తే లేదని మాజీ ఎమ్మెల్యేలు గొంగిడి సునీతామహేందర్ రెడ్డి, పైళ్ల శేఖర్ రెడ్డి అన్నారు. మంగళవారం వారు భువనగిరిలోని ఆర్‌అండ్‌బీ గెస్ట్ హౌస్‌లో మీడియాతో మాట్లాడారు. బీఆర్ఎస్ హయాంలోనే పోచంపల్లిలో ఐఐహెచ్‌టీ మంజూరు కోసం కేంద్రానికి ప్రతిపాదనలు పంపించినట్టు చెప్పారు. మాజీ మంత్రి కేటీఆర్ అనేకసార్లు కేంద్ర మంత్రుల దృష్టికి తీసుకెళ్లి.. పట్టుబట్టి ఐఐహెచ్‌టీ మంజూరు చేయించేందుకు ఎంతో కృషి చేశారని తెలిపారు. ఇప్పుడు రేవంత్‌రెడ్డి ఓర్వలేక ఐఐహెచ్‌టీని రంగారెడ్డి జిల్లాకు తరలించేకుట్ర చేస్తున్నారని మండిపడ్డారు. మాజీ సీఎం కేసీఆర్ చేపట్టిన అభివృద్ధి ఆనవాళ్లు లేకుండా చేస్తానని గతంలోనే రేవంత్‌రెడ్డి అన్నారని, ఆ మేరకే ఐఐహెచ్‌టీని తరలించే కుట్ర చేస్తున్నారని విమర్శించారు. పోచంపల్లి మండలంలోని కనుముక్కలలో ఏర్పాటు చేయాలని జీవోలో స్పష్టంగా ఉన్నా ఉద్దేశపూర్వకంగా తీసుకెళ్లడం ఏంటని ప్రశ్నించారు. కనుముక్కలలో హ్యాండ్లూమ్ పార్కును వేలంలో కొనుగోలు చేశామని, గతేడాది మాజీ మంత్రి కేటీఆర్, ఎమ్మెల్యేలు సైతం అక్కడ పర్యటించిన విషయాన్ని వారు గుర్తుచేశారు. ఐఐహెచ్‌టీఎం తరలింపును మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి ఎందుకు అడ్డుకోలేక పోతున్నారని ప్రశ్నించారు. స్కిల్ యూనివర్సిటీని కూడా పోచంపల్లిలోని రామానంద తీర్థ ఇన్‌స్టిట్యూట్‌లో ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

నటేశ్వరశర్మ కన్నుమూత

- సాహితీ లోకానికి ఆయాచితం సేవలు ఎనలేనివి
- తెలుగు, సంస్కృతంలో 60కి పైగా గ్రంథాలు రచించిన విశిష్ట కవి
- నిరుడు దాశరథి అవార్డుతో సత్కరించిన కేసీఆర్ సర్కార్
- నేడు బోయినపల్లి శ్మశానవాటికలో అంత్యక్రియలు



బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో గత సంవత్సరం ప్రతిష్ఠాత్మక దాశరథి పురస్కారంతో డాక్టర్ అయాచితం నటేశ్వరశర్మను సత్కరిస్తున్న అప్పటి మంత్రి శ్రీనివాస్‌గౌడ్

హైదరాబాద్, సెప్టెంబర్ 10(నమస్తే తెలంగాణ)/కామారెడ్డి/సుభాష్‌నగర్: సంస్కృతాంధ్ర విద్వత్కవి, అష్టావధాని, తెలంగాణ ప్రభుత్వ దాశరథి అవార్డు గ్రహీత డాక్టర్ అయాచితం నటేశ్వరశర్మ(68) మంగళవారం కన్నుమూశారు. ఆరు నెలలుగా అనారోగ్యంతో బాధపడుతున్న శర్మ హైదరాబాద్ బోయిన్‌పల్లిలోని తన స్వగృహంలో అంతిమ శ్వాసవిడిచారు. ఆయన తెలుగు, సంస్కృతంలో 60కి పైగా గ్రంథాలను రచించారు. తెలంగాణ రాష్ట్ర ఉద్యమంలో కవిగా తన గొంతు విప్పారు. ఆయన సాహితీ సేవలను గుర్తించిన కేసీఆర్ ప్రభుత్వం.. 2023లో దాశరథి అవార్డుతో సత్కరించింది. డాక్టర్ అయాచితం నటేశ్వరశర్మ 1956 జూలై 17న కామారెడ్డి జిల్లా రథాల రామారెడ్డిలో జయలక్ష్మీదేవి, ఆనందరాజశర్మ దంపతులకు జన్మించారు. ఆయనకు భార్య, ముగ్గురు కూతుళ్లు ఉన్నారు. నటేశ్వరశర్మ 1969లో విద్యాభ్యాసం చేస్తున్న రోజుల్లోనే సంస్కృతంలో, తెలుగులో పద్య, గేయ రచనలు చేయడం ప్రారంభించారు. 1970లో కంచి కామకోటి పీఠాధిపతి జయేంద్ర సరస్వతి స్వామి తిరుమల శ్రీవేంకటేశ్వర వేద సంస్కృత పాఠశాలను సందర్శించిన సమయంలో విద్యార్థిగా ఉన్న శర్మ.. సంస్కృత శ్లోకాలతో స్వాగతం పలకడం విశేషం. తర్వాత శర్మ తన పాండిత్య ప్రతిభతో అంచెలంచెలుగా ఎదిగారు. ఉభయ రాష్ట్రాలకు సంబంధించి ఎన్నో పురస్కారాలను అందుకున్నారు.

ప్రాచ్యభాషా పీఠాధిపతిగా సేవలు

కామారెడ్డిలోని ప్రాచ్య విద్యాపరిషత్తు ప్రాచ్య కళాశాలలో 1977 నుంచి సంస్కృత విభాగాచార్యులుగా, అనంతరం ప్రధానాచార్యులుగా పనిచేసి 2014 జూలైలో పదవీ విరమణ చేశారు. 2011 నుంచి 2013 వరకు ఉస్మానియా విశ్వవిద్యాలయంలోని ప్రాచ్య భాషా విభాగానికి పీఠాధిపతి (డీన్)గా సేవలు అందించారు. ఆయన సాహిత్య వ్యాసాలు, కవితలు, విమర్శలు వివిధ పత్రికల్లో ప్రచురితమయ్యాయి. అంతర్యామి శీర్షికతో చేసిన రచనలు పాఠకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. రామప్ప దేవాలయ శిల్పకళా వైభవాన్ని చాటి చెప్తూ ఆయన రచించిన సంస్కృత సంగీత రూపకం 'నాగిని' ఇటీవల హైదరాబాద్ ఆకాశవాణిలో ప్రసారమైంది. విద్యార్థి దశలో రాసిన వచన కవితా సంపుటి 'విక్రాంతిగీతి' మహాకవి దాశరథి ప్రశంసలు అందుకున్నది. అవధాని శశాంక, శతావధాని సమ్మన్నగారి లక్ష్మీనరసింహశర్మ అవధానాలతో స్ఫూర్తి పొందిన శర్మ.. డాక్టర్ రంగనాథ వాచస్పతితో కలిసి జంట అవధానాలు చేశారు. నటేశ్వరశర్మ తొలి గేయసంపుటి 'వసంతకుమారి'(1981). ఖండకావ్యాలలో సమయవిలాసిని, పంచశరీయం, సౌదామినీ విలాసం, చుక్కలు, చైత్రరథం, ఆటవెలది, జీవనయానం విశిష్ట రచనలుగా పేరొందాయి. వ్యవహారిక భాషలో రాసిన 'కవితాశతకం'.. మహాకవి శ్రీశ్రీ రచన 'సిరిసిరిమువ్వ' శతకాన్ని తలపిస్తుంది. ఆయన విశిష్ట సాహిత్య సేవలను గుర్తించిన 'భక్తిసాధనమ్' ఆధ్యాత్మిక సంస్థ గజారోహణ పురస్కారంతో సత్కరించింది.

సత్కారాలు.. పురస్కారాలు

రంజని-విశ్వనాథ పద్యకవితా పురస్కారం-2009, కిన్నెర ఆర్ట్ థియేటర్ వారి వచన కవితా పురస్కారం-2010, కిన్నెర-కుందుర్తి వచన కవితా పురస్కారం-2011, రాష్ట్రకవి ఔగేటి ధార్మిక సాహితీ పురస్కారం-2012, తెలుగు విశ్వవిద్యాలయం నుంచి అవధాన కీర్తిపురస్కారం-2012, సర్వవైదిక సంస్థానం విశిష్ట కవి పురస్కారం-2013, తెలంగాణ పద్య సాహిత్య పురస్కారం-2013, శాతవాహన విశ్వవిద్యాలయం నుంచి ఉత్తమ పద్యకవి పురస్కారం-2014, తేజ ఆర్ట్ క్రియేషన్స్ నుంచి విశిష్ట కవి పురస్కారం-2014, విశ్వసాహితి విశిష్ట సాహిత్య పురస్కారం-2014, భక్తి టీవీ ఆధ్యాత్మిక సేవా పురస్కారం-2014, తెలుగు విశ్వవిద్యాలయం నుంచి అవధాన ప్రతిభా పురస్కారం-2015, ఇందూరు అపురూప సాహితీ పురస్కారం-2016, వర్గల్ సరస్వతీ క్షేత్రం వారి 'అవధాన భారతి' పురస్కారం-2020, మల్లినాథసూరి కళాపీఠం వారి 'మహోపాధ్యాయ' పురస్కారం-2021, డీవీఎల్ఎన్ శాస్త్రి స్మారక సాహితీ పురస్కారం-2021, కోటంరాజు స్మారక సాహితీ పురస్కారం-2021 వంటి ఎన్నో పురస్కారాలను నటేశ్వరశర్మ అందుకున్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం గత సంవత్సరం ప్రతిష్ఠాత్మక దాశరథి పురస్కారంతో సత్కరించింది. అయాచితం మృతి తెలంగాణ సాహితీ లోకానికి తీరని లోటని పలువురు కవులు, ఆయా రంగాలకు చెందిన ప్రముఖులు, మాజీ మంత్రి హరీశ్‌రావు, ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్ తదితరులు నివాళులు అర్పించారు. బోయిన్‌పల్లిలోని శ్మశానవాటికలో బుధవారం అంత్యక్రియలు నిర్వహించనున్నట్టు కుటుంబ సభ్యులు తెలిపారు.

వందకుపైగా అష్టావధానాలు

నటేశ్వరశర్మ రచించిన అభిజ్ఞాన శాకుంతలానికి పద్యానువాద ప్రబంధం 'శకుంతల'కు తెలుగు విశ్వవిద్యాలయం నుంచి ఉత్తమ కావ్య పురస్కారం లభించింది. దేశభక్తి కవితా సంపుటి 'భారతీ ప్రశస్తి'కి జాతీయ సాహిత్య పరిషత్తు పురస్కారం లభించింది. రుతువుల సోయగాలను వర్ణిస్తూ రచించిన 'రుతుగీత'కు ఉత్తమ కావ్య పురస్కారం వరించింది. తెలంగాణ రాష్ట్ర వైభవాన్ని ప్రస్తుతిస్తూ సంస్కృతంలో రాసిన 'తెలంగాణ సుప్రభాతం'.. 'తెలంగాణ' మాసపత్రికలో ధారావాహికంగా ప్రచురితమై పాఠకులను ఆకట్టుకున్నది. రాష్ట్రావిర్భావం తర్వాత 33 జిల్లాల ప్రత్యేకతలను తెలుపుతూ రాసిన పద్యాలు ఈ నేల విశిష్టతను చాటాయి. సంస్కృతాంధ్ర భాషల్లో శర్మ నూటికిపైగా అష్టావధానాలు చేశారు. అవధాన ప్రతిభకు తెలుగు విశ్వవిద్యాలయ ప్రతిభా పురస్కారం లభించింది. ఆదిశంకరాచార్యులు రచించిన 'సౌందర్యలహరి'పై పరిశోధనలకుగాను 1994లో ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి డాక్టరేట్ పట్టా, స్వర్ణపతకం అందుకున్నారు. ఆముక్తమాల్యదపై ఆయన విమర్శనాత్మక గ్రంథం ప్రామాణికమైనది.

ప్రభుత్వానికి ప్రజారోగ్యం పట్టదా?

- జ్వరాలతో అల్లాడుతున్నా నిర్లక్ష్యమెందుకు?
- గ్రామాల్లో పారిశుద్ధ్యంపై సర్కారు దృష్టిపెట్టాలి
- మాజీ మంత్రి కొప్పుల ఫైర్

మాట్లాడుతున్న కొప్పుల ఈశ్వర్

వెల్గటూర్, సెప్టెంబర్ 10: 'ఎన్నో మాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పాలనను పూర్తిగా గాలికొదిలేసింది. ఫలితంగా పల్లె, పట్టణాల్లో పారిశుద్ధ్యం లోపించి ప్రజలు విష జ్వరాలతో అల్లాడిపోతున్నారు. దవాఖానల్లో వసతులు, మందులు లేక ఇబ్బందులు పడుతున్నారు. అయినా.. ప్రభుత్వానికి ప్రజారోగ్యంపై కనీస పట్టింపులేకుండా పోయింది' అని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ మండిపడ్డారు. జగిత్యాల జిల్లా వెల్గటూర్, ఎండపల్లి మండలాల్లో విష జ్వరాలతో మృతిచెందిన వారి కుటుంబాలను మంగళవారం పరామర్శించారు. వెల్గటూర్‌లో కొప్పుల మీడియా సమావేశంలో మాట్లాడారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు అమలు చేయకుండా కాంగ్రెస్ నాయకులు కాలం గడుపుతున్నారని, ఫలితంగా గ్రామాల్లో పారిశుద్ధ్యం లోపించి డెంగ్యూ, చికున్‌గున్యా లాంటి విష జ్వరాలు ప్రబలుతున్నాయని మండిపడ్డారు. గత ఏడెనిమిదేండ్లలో ఒక్క డెంగ్యూ కేసైనా నమోదైందా? ప్రజలు ఆలోచించాలని సూచించారు. ప్రజలు జ్వరాలతో అల్లాడుతున్నారని, ప్రభుత్వ దవాఖానలకు వెళితే వసతులు లేక ఇబ్బందులు పడుతున్నారని, అయినా.. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి కనీస పట్టింపులేకుండా పోయిందని, ఆయన ప్రతిపక్షాలను తిట్టడమే పనిగా పెట్టుకున్నారని తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఎమ్మెల్యేలు, మంత్రులు అయితే నియోజకవర్గాల్లో సొంత పనులు చేసుకుంటున్నారని, ప్రజారోగ్యాన్ని గాలికొదిలేశారని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఇప్పటికైనా వైద్యులు, అధికారులతో రివ్యూ సమావేశాలు ఏర్పాటు చేసి గ్రామాల్లో పారిశుద్ధ్యాన్ని మెరుగుపరిచి, మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేసి ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

చికిత్స పొందుతున్న విద్యార్థులను పరామర్శిస్తున్న సబ్ కలెక్టర్ శ్రద్ధా శుక్లా

గురుకులానికి ఫీవర్.. మూడు రోజులు సెలవులు

- సిర్పూర్-టీ స్కూల్‌లో 30 మందికిపైగా విష జ్వరాలు
- విద్యార్థులను పరామర్శించిన సబ్ కలెక్టర్ శ్రద్ధా శుక్లా

సిర్పూర్(టీ), సెప్టెంబర్ 10: కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్(టీ)లోని సాంఘిక సంక్షేమ గురుకుల (బాలుర) పాఠశాల-కళాశాల జ్వరాలతో మంచం పట్టింది. దీంతో అధికారులు మూడు రోజుల పాటు సెలవులు ప్రకటించి పిల్లలను ఇండ్లకు పంపిస్తున్నారు. ఇక్కడ 450 మంది విద్యార్థులు చదువుతున్నారు. నాలుగు రోజుల క్రితం 30 మందికి పైగా జ్వరాల బారిన పడ్డారు. విడతల వారీగా పిల్లలను సిర్పూర్(టీ) సామాజిక దవాఖానకు తరలించినట్టు తెలుస్తున్నది. దవాఖానలో సరిపడా బెడ్లు లేక గురుకుల పాఠశాల నుంచి తెప్పించి మరీ వాటిపైనే విద్యార్థులకు చికిత్స అందించారు. మంగళవారం నాటికి 100 మందికి జ్వరాలు వచ్చినట్టు గుర్తించిన అధికారులు మూడు రోజుల పాటు సెలవులు ప్రకటించి విద్యార్థులను ఇండ్లకు పంపించారు. సిర్పూర్(టీ) సామాజిక దవాఖానలో చికిత్స పొందుతున్న 10 మంది (మంగళవారం ఉదయం వరకు) విద్యార్థులను కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధా శుక్లా మంగళవారం పరామర్శించారు.

ఆర్టీసీపై రుణభారాన్ని తగ్గించాలి

- టీజీఎస్ఆర్టీసీ సమీక్షలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

హైదరాబాద్, సెప్టెంబర్ 10 (నమస్తే తెలంగాణ): టీజీఎస్ఆర్టీసీపై క్రమంగా రుణభారాన్ని తగ్గించాలని సీఎం రేవంత్‌రెడ్డి సూచించారు. నూతన బస్సుల కొనుగోలుకు ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. సచివాలయంలో మంగళవారం ఆర్టీసీ అధికారులతో సీఎం సమీక్ష సమావేశం నిర్వహించారు. మహాలక్ష్మి పథకం ద్వారా 83.42 కోట్ల మంది మహిళలు ఉచితంగా ప్రయాణించారని, మహిళా ప్రయాణికులకు రూ.2,840.71 కోట్లు ఆదా అయ్యాయని మంత్రి పొన్నం ప్రభాకర్ వివరించారు. అనంతరం వివిధ బ్యాంకులు, ఉద్యోగుల భవిష్య నిధి ఖాతా నుంచి వాడుకున్న నిధులు, విశ్రాంత ఉద్యోగులకు చెల్లించాల్సిన బకాయిలు కలిపి రూ.6,322 కోట్ల రుణాలు ఉన్నట్టు అధికారులు సీఎంకు వివరించారు. సమీక్షలో సీఎస్ శాంతికుమారి, సీఎం కార్యదర్శులు చంద్రశేఖర్‌రెడ్డి, షానవాజ్ ఖాసీం, రవాణా శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్‌రాజ్, ఆర్టీసీ ఎండీ సజ్జనార్ పాల్గొన్నారు.

'వెల్ఫేర్ కమిటీలు వద్దు'

హైదరాబాద్, సెప్టెంబర్ 10 (నమస్తే తెలంగాణ): ఆర్టీసీలో వెల్ఫేర్ కమిటీలను నియమించవద్దని, ఎన్నికల సమయంలో కాంగ్రెస్ మ్యానిఫెస్టోలో ప్రకటించినట్టు ఆర్టీసీని ఆదుకునే కార్యక్రమాలను చేపట్టాలని ఎస్ఎంయూరాష్ట్ర అధ్యక్షుడు పీ కమాల్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి మర్రి నరేందర్ డిమాండ్ చేశారు.



శ్వేత పార్థివదేహం వద్ద రోదిస్తున్న లక్ష్మారెడ్డిని ఓదార్చుతున్న మాజీ మంత్రి హరీశ్‌రావు, చిత్రంలో మాజీ మంత్రులు నిరంజన్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, గంగుల కమలాకర్, ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

అశ్రునయనాల మధ్య శ్వేతారెడ్డి అంత్యక్రియలు

- మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు, నాయకుల హాజరు
- లక్ష్మారెడ్డికి మంత్రి జూపల్లి కృష్ణారావు ఓదార్పు

తిమ్మాజిపేట, సెప్టెంబర్ 10: మాజీ మంత్రి డాక్టర్ లక్ష్మారెడ్డి సతీమణి శ్వేతారెడ్డి అంత్యక్రియలు మంగళవారం సాయంత్రం 4 గంటలకు ఆయన సొంతూరు నాగర్‌కర్నూల్ జిల్లా తిమ్మాజిపేట మండలం ఆవంచలో అశ్రునయాల మధ్య జరిగాయి. శ్వేతారెడ్డి సోమవారం రాత్రి చెన్నైలో మరణించగా.. మంగళవారం ఉదయం 11 గంటలకు ఆమె భౌతికకాయాన్ని సొంతూరుకు తీసుకొచ్చారు. దీంతో వారి కుటుంబసభ్యులు, బంధువులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, శ్రేయోభిలాషులు కన్నీటి పర్యంతమయ్యారు. ఆమె పార్థివదేహాన్ని చూసి లక్ష్మారెడ్డి బోరున విలపించారు. గ్రామ శివారులోని వారి వ్యవసాయ క్షేత్రంలో నిర్వహించిన అంత్యక్రియలకు పలువురు రాజకీయ నాయకులు, మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు హాజరయ్యారు.

లక్ష్మారెడ్డికి పలువురి పరామర్శ

లక్ష్మారెడ్డి సతీమణి శ్వేత మృతి చెందిన విషయం తెలుసుకొన్న మాజీ మంత్రులు హరీశ్‌రావు, సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, గంగుల కమలాకర్, మాజీ స్పీకర్ మధుసూదనాచారి, ఎమ్మెల్సీలు చల్లా వెంకట్రామిరెడ్డి, నవీన్‌కుమార్‌రెడ్డి, ఎంపీలు ఈటల రాజేందర్, డీకే అరుణ, ఎమ్మెల్యేలు పల్లా రాజేశ్వర్‌రెడ్డి, అనిరుధ్‌రెడ్డి, బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, కసిరెడ్డి నారాయణరెడ్డి, శ్రీహరి, శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు గువ్వల బాలరాజు, ఆల వెంకటేశ్వర్‌రెడ్డి, రాజేందర్‌రెడ్డి, జైపాల్‌యాదవ్, ఎర్ర శేఖర్, అంజయ్య యాదవ్, నరేందర్‌రెడ్డి, పెద్ది సుదర్శన్‌రెడ్డి, బీఆర్ఎస్ రాష్ట్ర నేతలు కర్నె ప్రభాకర్, ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్, ఎర్రోళ్ల శ్రీనివాస్, మర్రి సతీమణి జమున, బీఆర్ఎస్ నాయకులు శ్వేత పార్థివదేహానికి నివాళులర్పించి లక్ష్మారెడ్డికి ధైర్యం చెప్పారు. అలాగే ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు లక్ష్మారెడ్డి, రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి కూడా లక్ష్మారెడ్డిని ఓదార్చారు.

కేసీఆర్ సంతాపం

హైదరాబాద్, సెప్టెంబర్ 10 (నమస్తే తెలంగాణ) : మాజీ మంత్రి, బీఆర్ఎస్ సీనియర్ నేత, జడ్చర్ల మాజీ ఎమ్మెల్యే డాక్టర్ చర్లకోల లక్ష్మారెడ్డి సతీమణి శ్వేతా లక్ష్మారెడ్డి మరణంపై బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ సంతాపం ప్రకటించారు. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

మృతి తీవ్రంగా బాధించింది: కేటీఆర్

శ్వేతాలక్ష్మారెడ్డి మరణవార్త తీవ్రంగా బాధించిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పేర్కొన్నారు. ఈ కష్ట సమయంలో వారి కుటుంబానికి ధైర్యాన్ని ప్రసాదించాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నానని చెప్పారు.

చాక్‌పీసులు, డస్టర్లు కొనేందుకు డబ్బులేవి?

- నాలుగు నెలలైనా రూపాయి విదిల్చని విద్యాశాఖ
- ఇంకా విడుదల కాని స్కూల్ గ్రాంట్ నిధులు
- టీచర్లే జేబు నుంచి ఖర్చుచేయాల్సిన పరిస్థితి
- మరోవైపు గ్రాంట్‌కు కోతలు పెట్టే ప్రతిపాదనలు

హైదరాబాద్, సెప్టెంబర్ 10 (నమస్తే తెలంగాణ): కాంపొజిట్ స్కూల్ గ్రాంట్. పాఠశాలల్లో చాక్‌పీసులు, డస్టర్లు కొనాలన్నా.. ఇంటర్నెట్, విద్యుత్తు బిల్లులు చెల్లించాలన్నా .. పంద్రాగస్టుకో, జనవరి 26కో స్వీట్లు పంపిణీ చేయాలన్నా ఈ నిధులే ఆధారం. ఇలాంటి స్కూల్ గ్రాంట్ నిధులు ఇంతవరకు మంజూరు కాలేదు. విద్యాసంవత్సరం ప్రారంభమై నాలుగు నెలలు గడుస్తున్నా సర్కారు ఒక్క రూపాయి విదిల్చలేదు. దీంతో టీచర్లే తలా కొంత వేసుకుని.. జేబు నుంచి ఖర్చుచేయాల్సిన పరిస్థితి నెలకొన్నది. దీంతో టీచర్లంతా సర్కారు తీరుపై భగ్గుమంటున్నారు. గత సర్కారు జూలైలోనే 50శాతం నిధులను విడుదల చేసింది. కానిప్పుడు ఇంకా నిధులు విడుదల కాకపోవడంతో పాఠశాల నిర్వహణ అధ్వానంగా తయారైంది. స్కూల్ గ్రాంట్ నిధుల్లో నుంచి విద్యుత్తు బిల్లులు చెల్లించేవారు. అయితే ఇటీవలే సర్కారు విద్యాసంస్థలకు ఉచిత విద్యుత్తును ప్రకటించింది. దీంతో స్కూల్ గ్రాంట్‌గా ఇచ్చే నిధుల్లో కొంతమేర కోతలు పెట్టే ప్రతిపాదనలు విద్యాశాఖ పరిశీలనలో ఉన్నాయి. ఇదే జరిగితే ఒక్కో స్కూల్‌కు రూ.3 నుంచి నాలుగు వేలు కోతపడనున్నది. ఒక్క స్కూల్ గ్రాంటే కాకుండా పారిశుద్ధ్య నిధులు, ఇతర గ్రాంట్‌లను కూడా ప్రభుత్వం విడుదల చేయడంలేదు.

- పారిశుద్ధ్య నిర్వహణకు విద్యార్థుల సంఖ్యను బట్టి స్కూల్ ఫెసిలిటీ గ్రాంట్‌గా రూ. 3వేల నుంచి 30వేల వరకు ప్రభుత్వం నిధులిస్తామన్నది. సింగరేణి సంస్థ ద్వారా రూ.136 కోట్ల డీఎంఎఫ్‌టీ ఫండ్స్‌ను కేటాయించాలని ఆయా సంస్థకు ఆదేశాలిచ్చింది. కానీ ఇంతవరకు ఈ నిధులు కలెక్టర్ల ఖాతాల్లో జమకాలేదు.
- స్పోర్ట్స్ గ్రాంట్‌గా ప్రాథమిక స్కూళ్లకు ఐదు వేలు, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలకు పది వేల చొప్పున ఇవ్వాల్సి ఉండగా, ఇంతవరకు విడుదల చేయలేదు.
- మండల రిసోర్స్ సెంటర్లు(ఎంఆర్‌సీ), క్లస్టర్ రిసోర్స్ సెంటర్లకు(సీఆర్‌సీ) రూ. 39వేల గ్రాంట్‌ను విడుదల చేయాల్సి ఉండగా రూపాయి విడుదల చేయలేదు.
- కేజీబీవీలు, మాడల్ స్కూళ్లల్లోని హాస్టళ్లకు రోజువారీ ఖర్చులకు రూ. 30వేలు అడ్వాన్స్‌డ్‌గా ఇస్తామని విద్యాశాఖ ప్రొసీడింగ్స్ ఇచ్చింది. ఇంకా 20 జిల్లాల్లోని కేజీబీవీలు, మాడల్ స్కూల్ అటాచ్డ్ హాస్టళ్లకు ఇంతవరకు అడ్వాన్స్ మొత్తం అందలేదు.

స్కూల్ గ్రాంట్ స్లాబులిలా..

విద్యార్థులు	గ్రాంట్‌గా అందించే మొత్తం
1- 30 మంది	రూ. 10 వేలు
31-100	రూ. 25 వేలు
101-250	రూ. 50 వేలు
251- వెయ్యి మంది	రూ. 75 వేలు
వెయ్యి మందికి పైగా	రూ. లక్ష

పారిశుద్ధ్య నిధులు విడుదల చేయండి: టీఎస్‌జీహెచ్ఎంఏ

పాఠశాలల్లో పారిశుద్ధ్య నిర్వహణకు కేటాయించిన నిధులను విడుదల చేయాలని తెలంగాణ గెజిటెడ్ హెడ్మాస్టర్స్ అసోసియేషన్ (టీఎస్‌జీహెచ్ఎంఏ) ప్రభుత్వాన్ని కోరింది. ఇప్పటివరకు పారిశుద్ధ్య నిధులింకా విడుదలకాలేదని, తక్షణమే ఈ నిధులను అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలకు అందేలా చూడాలని అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు రాజభాను చంద్రప్రకాశ్, ప్రధాన కార్యదర్శి రాజుగంగారెడ్డి, కోశాధికారి బీ తుకారాం ప్రభుత్వాన్ని కోరారు. మంగళవారం పాఠశాల విద్యాశాఖ అధికారులను కలిసి వినతిపత్రాన్ని సమర్పించారు. నిధుల వినియోగానికి సంబంధించిన మార్గదర్శకాలను, ఎప్పటినుంచి ఈ నిధులను వినియోగించుకోవాలో స్పష్టంచేయాలని ప్రభుత్వాన్ని కోరారు.

టెట్ మార్కుల అప్‌లోడ్‌కు చాన్స్

హైదరాబాద్, సెప్టెంబర్ 10 (నమస్తే తెలంగాణ): డీఎస్సీ ఫలితాల విడుదలకు ముందే టెట్ మార్కులను అప్‌లోడ్ చేసుకునే అవకాశాన్ని విద్యాశాఖ కల్పించనున్నది. ఇందుకు రెండు రోజులపాటు అవకాశం కల్పించాలని అధికారులు నిర్ణయించారు. డీఎస్సీ ఫైనల్ 'కీ'ని ఇప్పటికే విడుదల చేశారు. ఫైనల్ 'కీ'పైనా అభ్యర్థులు పెద్ద ఎత్తున అభ్యంతరాలు వ్యక్తంచేస్తున్నారు. ఆయా అభ్యంతరాలను రివ్యూ కమిటీ పరిశీలనకు పంపించారు. కమిటీ పరిశీలన పూర్తైన తర్వాత రివైజ్డ్ ఫైనల్ 'కీ'ని విద్యాశాఖ విడుదల చేయనుంది. ఆ తర్వాత టెట్ మార్కులను కలిపి జనరల్ ర్యాంకింగ్ లిస్ట్(జీఆర్ఎల్)ను విడుదల చేస్తారు. దీంట్లో భాగంగానే టెట్ మార్కులను మరోసారి అప్‌లోడ్ చేసుకునే అవకాశమివ్వాలని అధికారులు నిర్ణయించారు. దీనిపై ఒకటీ రెండు రోజుల్లో అధికారిక ప్రకటన విడుదల కానుంది.

లెక్చరర్లు లేని కాలేజీ!

- ముఖ్యమంత్రి సొంత నియోజకవర్గంలో దుస్థితి
- ఒక్క అధ్యాపకుడినీ నియమించని ప్రభుత్వం
- దిక్కుతోచక టీసీలు తీసుకొని వెళ్తున్న విద్యార్థులు

బొంరాస్‌పేట, సెప్టెంబర్ 10: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సొంత నియోజకవర్గం కొడంగల్‌లోని బొంరాస్‌పేట ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థుల పరిస్థితి అగమ్యగోచరంగా తయారైంది. బొంరాస్‌పేటకు ఇటీవల ప్రభుత్వ జూనియర్ కళాశాల మంజూరైంది. ఈ విద్యా సంవత్సరం నుంచే తరగతులు ప్రారంభమవుతాయని అధికారులు ప్రకటించారు. ఈ కళాశాలలో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్ఈసీ గ్రూపులతోపాటు ఎంపీహెచ్ డబ్ల్యూ, ఎంఎల్‌టీ వంటి వృత్తి విద్యా కోర్సులను అనుమతించారు. దీంతో ఆయా కోర్సుల్లో 30 మంది విద్యార్థులు అడ్మిషన్లు పొందారు. తీరా ప్రభుత్వం ఒక్క అధ్యాపకుడిని కూడా నియమించకపోవడంతో ఇప్పటికే పది మంది విద్యార్థులు టీసీలు తీసుకొని ఇతర కాలేజీలకు వెళ్లిపోయారు. మిగతా పేద విద్యార్థులు లెక్చరర్ల రాకకోసం ఎదురు చూస్తున్నారు. ఇప్పటికే ఇతర కాలేజీల్లో ఇంటర్ మొదటి సంవత్సరం తరగతులు ప్రారంభం కాగా ఈ కాలేజీలో చేరిన విద్యార్థులు దిక్కుతోచని స్థితిని ఎదుర్కొంటున్నారు. విద్యా సంవత్సరం ప్రారంభంలోనే కాలేజీలో అధ్యాపకులను నియమించి ఉంటే విద్యార్థులు ఇంకా ఎక్కువ సంఖ్యలో చేరేవారని, సీఎం రేవంత్‌రెడ్డి ఇప్పటికైనా స్పందించి బొంరాస్‌పేట జూనియర్ కళాశాలలో లెక్చరర్లను నియమించి తరగతులు ప్రారంభించాలని విద్యార్థులు, తల్లిదండ్రులు కోరుతున్నారు.

తరగతుల